క్లుప్తంగా

ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్

నగరి: స్థానిక కోర్టులో ఫిబ్రవరి 11వ తేదీన జాతీయ లోక్ అధాలత్ నిర్వహిస్తున్నట్టు జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ ఎస్.విష్ణువర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, చెక్ బౌన్స్, భూ, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. అధిక సంఖ్యలో కేసుల పరిష్కా రానికి కక్షిదారులు, పోలీసు, బీమా సంస్థలు, వివిధ శాఖల అధికారులు కృషిచేయాలన్నారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈకేవైసీకి 15 తుది గడువు

నగరి: పీఎం కిసాన్ లబ్ధి పొందాలంటే ఈనెల 15వ తేదీలోపు రైతులు ఈకేవైసీ చేసుకోవాలని వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో పీఎం కిసాన్‌కు అర్హత ఉన్నవారు 4,546 మంది ఉండగా, ఇప్పటివరకు 3,250 మంది మాత్రమే ఈకేవైసీ చేసుకున్నారన్నారు. ఆర్బీకేల్లో లేదా వ్యవసాయ కార్యాలయంలో ఈకేవైసీ చేసుకోవచ్చని, ఆన్‌లైన్‌లోనూ ఫార్మర్ ఈకేవైసీ యాప్‌లో నమోదు చేసు కోవచ్చని తెలిపారు.

దూషణ పరులను శిక్షించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న అయ్యప్ప సేవా సమితి నాయకులు

పుత్తూరు రూరల్: భావ ప్రకటన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తూ హిందూ దేవుళ్లను దూషించిన బైరి నరేష్, రేంజర్ల రాజేష్‌ను కఠినంగా శిక్షించాలని స్థానిక అయ్యప్ప సేవా సమితి సభ్యులు శుక్రవారం ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సేవా సమితి నాయకుడు మునస్వామినాయుడు మాట్లాడుతూ హిందువులు ఎంతో నమ్మకంతో కొలిచే అయ్యప్పస్వామి, సరస్వతీదేవిని కించపరుస్తూ వీడియోలను విడుదల చేసిన నరేష్, రాజేష్‌ను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి నాయకులు సుబ్రమణ్యం, మేఘనాథ్, మునికృష్ణయ్య, నరసింహారాజు, బాబు, హరి, శ్రీధర్‌నాయుడు, మేకల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

వెదురుకుప్పం: మండలంలోని బ్రాహ్మణపల్లె సచివాలయ పరిధిలో శనివారం ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టె సుబ్రమణ్యం, మండల అధ్యక్షుడు పేట ధనుంజయరెడ్డి శుక్రవారం తెలిపారు. నెమలగుంట, కాపుమెం డివెంగనపల్లె, బలిజ మొండివెంగనపల్లె, బండమీద ఇండ్లు గ్రామాల్లో కార్యక్రమం జరగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధి, సమస్యలను డిప్యూటీ సీఎం తెలుసుకుంటారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

ఆపస్ క్యాలెండర్ల విడుదల




క్యాలెండర్లు విడుదల చేస్తున్న డీవైఈఓ రఘురామయ్య

పుత్తూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) ముద్రించిన క్యాలెండర్, డైరీని డీవైఈఓ రఘురామయ్య శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ భావజాలం, దేశభక్తి, సంస్కృతి సంప్రదాయలు ఉట్టిపడేలా ముద్రించిన క్యాలెండర్, డైరీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలాజీ, చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి దొరస్వామి, గౌరవాధ్యక్షుడు సుబ్రమణ్యం, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూల్చివేతలపై హైకోర్టు స్టే

పుత్తూరు రూరల్: గేట్‌పుత్తూరులో పురాతన మస్జీది ముఖద్దస్ మసీదుతో పాటు ఇతర నిర్మాణాల తొలగింపునకు సంబంధించి రైల్వే అధికారులు ఇటీవల ఇచ్చిన నోటీసులపై రాష్ట్ర హైకోర్టు స్టే ఇచ్చినట్లు రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వీఎం.మాహీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వక్ఫ్ బోర్డు సీఈఓ రిట్ పిటిషన్ 834/2023 దాఖలు చేయగా శుక్రవారం లంచ్ మోషన్ సమయంలో విచారణ జరిపిన కోర్టు స్టే ఇచ్చినట్లు పేర్కొన్నారు. తదుపరి విచారణ ఫిబ్రవరి 3వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు.

గరుడునిపై గోవిందుడు



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారు శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామున స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలను సమర్పించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు ఊంజల్ సేవ జరిగింది. రాత్రి స్వామి వారికి గరుడ సేవ నిర్వహించారు.

ఇంటింటికీ పథకాల లబ్ధి

- సమష్టిగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



బ్రాహ్మణపల్లెలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రతి ఇంటికీ పథకాల లబ్ధి అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణపల్లె సచివాలయ పరిధిలోని కమ్మకండ్రిగ, దిగువ బ్రాహ్మణపల్లె, ఎగువ బ్రాహ్మణపల్లె, ఎస్టీ కాలనీల్లో వైస్ ఎంపీపీ రమణ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. డిప్యూటీ సీఎం పాల్గొని ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధితో పాటు సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఇళ్లు లేని వారిని గుర్తించి స్థలంతో పాటు పక్కా గృహాలు మంజూరు చేయాలని, సిమెంటు రోడ్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల వరకే రాజకీయాలని, అనంతరం అందరూ సమష్టిగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రజా సంక్షేమాన్ని కోరే పార్టీ వైఎస్సార్‌సీపీ మాత్రమేనని స్పష్టం చేశారు. మండలంలో జేజేఎం కింద 36 ఓవర్ హెడ్ ట్యాంకులను మంజూరు చేసినట్లు తెలిపారు. బ్రాహ్మణపల్లెకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా అంగన్వాడీ కేంద్రంలో పనిచేసే సిబ్బందితో మాట్లాడారు. పౌష్టికాహారాన్ని పెడుతున్నారా లేదా అని అడిగారు. ఆయా గ్రామాల్లో మహిళలు మంగళ హారతులతో డిప్యూటీ సీఎంకు సాదర స్వాగతం పలికారు.



పథకాల లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్యాలయాల ప్రారంభం

బ్రాహ్మణపల్లెలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ. 21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ. 17.5 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం భవనాలను ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రారంభించారు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి నిధులు రూ.7లక్షలతో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంటును ప్రారంభించారు. ఒకే చోట భవనాలు నిర్మించడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఎంపీడీఓ సుధాకరరావు, తహసీల్దార్ పుల్లారెడ్డి, పీఆర్‌డీఈ దయాసాగర్‌రెడ్డి, ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, వైస్ ఎంపీపీ బట్టే రమణసుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టె సుబ్రమణ్యం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పద్మనాభ రెడ్డి, మండల అధ్యక్షుడు పేట ధనుంజయ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ లోకనాథరెడ్డి, సర్పంచ్‌లు లలిత, శిరీష, గోవిందయ్య, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో ఆధార్ సెంటర్లు



కత్తెరపల్లెలో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకే గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వం ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని ఎంపీపీ లత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని డీఎం పురం, కత్తెరపల్లె సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండేలా గ్రామాల్లోనే ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ ధనంజ యవర్మ, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణయాదవ్, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ధనశేఖర్, సర్పంచ్ శేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ కుప్పయ్య, పలువురు నాయకులు, ఎంపీడీవో మోహన్‌మురళీ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనర్థాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద

వెదురుకుప్పం: మత్తు పదార్థాల వాడకం అనర్థదాయకమని ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద అన్నారు. శుక్రవారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వాడకం-అనర్థాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలైతే యువత భవిష్యత్‌ను నాశనం అవుతుందని తెలిపారు. కుటుంబాలు ఛిద్రమవుతాయని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన భవిష్యత్ కోసం మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ మంగళగౌరి, వైఆర్సి కో-ఆర్డినేటర్ శంకర్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రోడ్డు సమస్యకు పరిష్కారం



రోడ్డు పనుల ప్రారంభంలో ప్రజా ప్రతినిధులు

నగరి: విజయపురం మండలం, ఇళ్లత్తూరు గ్రామంలో నీటిసరఫరా పథకం, ఈశ్వరాలయానికి రహదారి సౌకర్యం లేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. దీర్ఘకాలికంగా ఈ సమస్య ఉంది. ఇటీవల ఈ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు రోడ్డు సమస్యను మంత్రి ఆర్కేరోజా దృష్టికి తెచ్చారు. ఈ అంశంపై స్పందించిన మంత్రి గడప గడపకు మన ప్రభుత్వం నిధుల నుంచి రోడ్డును ఏర్పాటు చేయాలని సూచించారు. 167 మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.7 లక్షలు మంజూరు చేశారు. శుక్రవారం రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వీరభద్ర, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపీనాథ్, సర్పంచ్ దీప్తాగోపి, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్, నాయకులు రవీంద్ర వర్మ పాల్గొన్నారు.

సమస్యలను గుర్తించేందుకే తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి

కార్వేటినగరం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో లోపాలు గుర్తించి మెరుగు పరిచేందుకే తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తిరుపతి విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బృందంతో కలసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆరోగ్యకేంద్రాల్లో మౌలిక వసతులు, భవనాలు ఉన్నాయా లేవా అని తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. సమస్యలు ఉంటే గుర్తించి వాటిని ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి మెరుగు పరుస్తామన్నారు. వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్‌ను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. విజిలెన్స్ సిబ్బంది చెన్నారెడ్డి, విజయకుమార్ పాల్గొన్నారు.

సస్యరక్షణతో మామిడిలో నాణ్యమైన దిగుబడి



సూచనలిస్తున్న ఉద్యానవనాధికారి సౌజన్య

పుత్తూరు రూరల్: మామిడి రైతులు పూత, పిందె దశల్లో పలు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ఉద్యానవనాధికారి జి.వెంకట సౌజన్య తెలిపారు. శుక్రవారం పుత్తూరు మండలం కేబీఆర్‌పురం గ్రామంలో మామిడి రైతులకు సస్యరక్షణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మామిడి చెట్లకు పూత పుష్కలంగా రావాలంటే పొటాషియం నైట్రేట్ 10 నుంచి 15 గ్రాములను లీటరు నీటిలో కలిపి, 10 గ్రాముల యూరియా, ఫార్ములా-4 సూక్ష్మకాలు 5 గ్రాములను లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. లేత పూత దశలో తేనె మంచు పురుగు, పేను బంక సమస్య ఎక్కువగా ఉంటుందని తెలిపారు. దీని నివారణకు ఇమిడాక్లోపిడ్ 0.5 మిల్లీలీటర్లను లీటరు నీటితో కలిపి పూత తడిసేలా పిచికారీ చేయాలని తెలిపారు. పిందె ఏర్పడిన తర్వాత మచ్చ తెగులు, తామర పురుగుల సమస్య తలెత్తుతుందని, ఈ దశలో పిందె రాలకుండా ఉండేందుకు ప్లానోటిక్స్ ఒక మిల్లీమీటర్ మందును 4.5 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పై సూచనలు పాటిస్తే నాణ్యమైన దిగుబడి పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో తోటబడి రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి పూజలు





గరుడ వాహనంపై లక్ష్మీనారాయణస్వామి, పాలసముద్రం : స్వామివారికి హారతి



నగరి కరకంఠేశ్వరస్వామి ఆలయంలో ..



పుత్తూరు గీతా మందిరంలో..

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఆలయ అర్చకుల బృందం తిరుప్పావై నిర్వహించారు. అనంతరం మూలవర్లను సుగంధభరిత ద్రవ్యాల తో అభిషేకించారు. పరిమళభరిత పుష్పమాలికలు, ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారి ఉత్సవమూర్తులను బ్యాండు మేళాల నడుమ కల్యాణ మండపానికి వేంచేపు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి హోమ పూజలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. సాయంత్రం శ్రీవారిని గరుడ వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ ధర్మకర్త శ్రీధర్ అన్నదానం చేశారు.

పాలసముద్రం: మండలంలోని రాచపాళ్యంలో వెలసిన శ్రీబాలగురునాథీశ్వరస్వామి, శ్రీకావేరిరాజుపురంలోని ఓం శక్తి అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమ పూజలు చేపట్టారు. వివిధ రకాల అభిషేకాలు చేసి, సుందరంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. శ్రీకావేరిరాజుపురం ఓం శక్తి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం మాల ధరించిన భక్తులు ఆదిపరాశక్తి అమ్మవారి దర్శనం కోసం తమిళనాడు రాష్ట్రం మేల్‌మరవత్తూరు బయలుదేరి వెళ్లారు.

కరకంఠేశ్వర ఆలయంలో..

నగరి: పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత కరకంఠేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆరుద్ర పూజలు ఘనంగా నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు చేసి పలురకాల హారతులు ఇచ్చారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ధర్మకర్త సుబ్రమణ్యం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

నింద్ర: మండలంలోని కునమరాజుపాళెంలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. మహాలక్ష్మి, లక్ష్మీనారాయణస్వామికి వివిధ రకాల అభిషేకాలు చేశారు. ప్రత్యేక పూజలు, అలంకరణల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ప్రత్యేక దీపారాధన పూజలు జరిగాయి.

శ్రీకృష్ణుడికి పౌర్ణమి హారతులు

పుత్తూరు రూరల్: పుత్తూరు శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని గీతా మందిరంలో శ్రీకృష్ణుడికి శుక్రవారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేశారు. సాయంత్రం గీతా పారాయణం, భజనలు నిర్వహించారు. ధనుర్మాసం పురస్కరించుకుని గోదాదేవి ప్రవచనలు చేపట్టారు. మహిళలు శ్రీకృష్ణ భగవానుడికి పౌర్ణమి హారతులిచ్చారు.

జల్లికట్టుకు అనుమతి ఇవ్వండి

- డీఐజీని కోరిన ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో రైతులు జరుపుకునే పశువుల పండుగకు అనుమతి ఇవ్వాలని డీఐజీని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కోరారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణపల్లెలో జరిగిన సమావేశం అనంతరం యువకులు మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్లికట్టుతో ప్రాణ నష్టం జరుగుతుందని భావించి సుప్రీంకోర్టు నిషేధించినట్లు గుర్తుచేశారు. గతంలో చిత్తూరు జిల్లాలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖ అనుమతి నిరాకరించినట్లు చెప్పారు. అనంతరం మంత్రి డీఐజీ రవిప్రకాష్‌కు ఫోన్‌చేసి మాట్లాడారు. గ్రామాల్లో రైతులు ఉత్సాహంగా జరుపుకునే జల్లికట్టుకు అనుమతించాలని కోరారు. సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా పశువుల పండుగను అత్యంత వైభవంగా జరుపుకుంటారని తెలియజేశారు. పోలీసులు గ్రామాల్లో ఎక్కడా జల్లికట్టు జరగకుండా అడ్డుకుంటున్నారని తన దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో జల్లికట్టు జరుగుతోందని, తమకు కూడా అనుమతి ఇవ్వాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారని తెలిపారు. తిరుపతి జిల్లాలో అనుమతి ఇస్తే తప్పకుండా చిత్తూరు జిల్లాలో కూడా ఇవ్వాలని కోరారు. లేకుంటే ఓ వర్గం దీన్ని కూడా రాజకీయంగా వాడుకుని గ్రామాల్లో విభేదాలను సృష్టిస్తుందని చెప్పారు. ఈ అంశంపై పరిశీలిస్తామని డీఐజీ చెప్పినట్లు మంత్రి తెలిపారు. వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలార్ ప్రకాష్, కో-ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, మాజీ సర్పంచ్ హేమశేఖర్‌రెడ్డి, దూదిమోహన్, జగదీశ్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

పుత్తూరు రూరల్: చేతి వృత్తుల్లో శిక్షణతో పాటు రుణాలు పొందుతున్న మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని సీఐ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రాష్ట్రీయ సేవా సమితి (రాస్) కార్యాలయంలో బ్యూటీషియన్ కోర్సు ముగింపు సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రుణాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. అంతకు ముందు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 18 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు రాస్ అధికారి రవి తెలిపారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీ ఇళ్లకు ఉచితంగా మీటర్లు



విద్యుత్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈ చిన్నరెడ్డెప్ప

కార్వేటినగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లోని ఇళ్లకు ఉచితంగా విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేస్తామని ట్రాన్స్‌కో డీఈ చిన్నరెడ్డెప్ప అన్నారు. శుక్రవారం డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆదేశాల మేరకు పద్మసరస్సు వద్ద జగనన్న కాలనీని డీఈ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఆధార్‌కార్డుతో పాటు గృహానికి సంబంధించిన పట్టాను జత చేసి దరఖాస్తు చేసుకుంటే 24 గంటల్లోనే విద్యుత్ మీటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. లేఅవుట్‌లో ఇప్పటికే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి కరెంట్ సరఫరా ఇచ్చామని పేర్కొన్నారు. కాలనీల్లో వీధి లైట్లకు ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేసి విద్యుత్‌ను ఆదా చేస్తామని తెలిపారు. కార్వేటినగరం సమీపంలోని పచ్చికాపల్లం లేఅవుట్, ఐటీఐ హౌసింగ్ లే అవుట్లలో కూడా విద్యుత్ సరఫరా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ ధనంజయవర్మ, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఏఈ రియాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో వేడుకగా ఆరుద్ర పూజలు



పుత్తూరులో శివపార్వతుల ఊరేగింపు



నగరి: ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

నగరి: మున్సిపల్ పరిధి కీళపట్టులోని శ్రీత్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వర ఆలయంలో శుక్రవారం ఆరుద్ర పూజలను వైభవంగా నిర్వహించారు. నటరాజస్వామి, శివగామిసుందరి ఉత్సవ మూర్తులకు వివిధ అభిషేకాలు నిర్వహించి, సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అన్న దానం చేశారు.

పుత్తూరు రూరల్: పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆరుద్ర ఉత్సవం వైభవంగా జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం నిర్వహించి, సూర్యోదయంతో పాటు భక్తులకు ఆరుద్ర దర్శన భాగ్యం కల్పించారు. ధనుర్మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రం రోజున ఈశ్వరుడి జన్మదినంగా ఉత్సవం జరుపుకోవడం ఆనవాయితీ. ఈ కార్యక్రమాన్ని పుత్తూరు పురోహితులు చిట్టమూరు రమేష్ బాబు, ధనలక్ష్మి దంపతులు ఏటా ధనుర్మాస పౌర్ణమి రోజున నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ముందుగా వినాయక పూజ, పలు వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లు విశేష అలంకరణతో సప్పరంపై ఆశీనులు చేసి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఇంటింటి వద్ద భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ కమిటి చైర్మన్ కె.రమేష్‌బాబు పర్యవేక్షించారు.

ప్రజా ప్రతినిధుల ఇళ్ల వద్ద డ్రైడే



మంత్రి ఆర్కే రోజా నివాసం వద్ద పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నగరి: పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణలో భాగంగా శుక్రవారం ప్రజాప్రతినిధుల ఇళ్లవద్ద, ప్రజల నివాసాల వద్ద డ్రైడే నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నగరి మున్సిపల్ సిబ్బంది, వైద్యాధికారులు మంత్రి ఆర్కేరోజా ఇంటివద్ద డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం మంత్రి నివాసం వద్దకు వెళ్లిన వారు పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉందా, పూల కుండీల్లో నీరు నిల్వ ఉందా అని పరిశీలించారు. హైజిన్ యాప్ ద్వారా వివరాలు నమోదు చేశారు. పుదుపేట యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీప్రియ, సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్‌బాబు, వార్డు శాని టేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, ఏఎన్ఎంలు, ఆషాలు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి

గంగాధరనెల్లూరు: ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని సరివిరెడ్డిపల్లె, బంగారెడ్డిపల్లెలో శుక్రవారం పారిశుద్ధ్యం ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమలు కుట్టడం వల్ల అనేక వ్యాధులు సోకే ప్రమాదం ఉందని తెలిపారు. నీటిని కాచి వడగట్టి తాగాలన్నారు. పరిశుభ్రత రోగాలు దూరమవుతాయని తెలిపారు.

సంఘమిత్రలు బాధ్యతగా పని చేయాలి



మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం పరిద్‌మస్తాన్

పాలసముద్రం: సంఘమిత్రలు, వీఓ లీడర్లు బాధ్యతగా పనిచేసి గ్రూప్‌లను ఏగ్రేడ్‌లో ఉంచాలని ఐకేపీ ఏపీఎం పరీద్‌మస్తాన్ తెలిపారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో మండల సమఖ్య సమావేశం జరిగింది. ఏపీఎం మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ రుణాలను సక్రమంగా కంతుల ప్రకారం కట్టించాల్సిన బాధ్యత సంబంధిత సంఘ మిత్రాలపై ఉందని తెలిపారు. స్త్రీనిధి, ఉన్నతి రుణాలను కూడా సక్రమంగా చెల్లించేలా అవగాహన పెంచాలన్నారు. సక్రమంగా చెల్లిస్తే మళ్లీ రూ. లక్ష యాభై వేల వరకు రుణాలు ఇస్తామని తెలిపారు. రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. సీసీలు చిరంజీవి, సరస పాల్గొన్నారు.